

# ఇనుప తెరలు

## పాలడుగు వెంకటేశ్వర

కొల్లి వీర వెంకట సత్యశివ సుందర రామారావుది భారీ విగ్రహం. అతని ఆస్తిపాస్తులూ, ఆ చుట్టు ప్రక్కల వూళ్లల్లో అతనికిగల పలుకుబడీ, పరపతీ కూడా సామాన్యమయినవి కావు; అతను ఎమ్మెల్యేగా పోటీచేసి రెండుసార్లు గెలిచాడు. మూడోసారి వోడిపోయాడు. అయితే సహకార బ్యాంకులోనూ, పంచాయితీ సమితిలోనూ కొన్ని—సంవత్సరాలుగా — కొన్ని పదుల సంవత్సరాల నుండీ — అతను నిర్వహిస్తూ వచ్చిన పదవులకి ఏ నాడూ ఢోకా లేకుండా వుండింది. అతని మాటా, నడవడీ గంభీరంగా వుంటాయి. అతని నిజాయితీ, స్వార్థ రాహిత్యమూ, మాట కోసం ప్రాణం ఇవ్వటానికయినా సిద్ధపడే అతని తత్వమూ, స్నేహం కోసం ఏమయినా త్యాగం చేయగల సాహస ప్రవృత్తి అతన్ని ఆ ప్రాంతంలో పెద్దమనిషిగా, ప్రజల మనిషిగా, ప్రజానాయకుడిగా నిలిపి వుంచాయి. అతనికి విద్యాలయాలన్నా, భావి భారత పౌరుల్ని తీర్చిదిద్దే వుపాధ్యాయులన్నా, రెప రెప లాడే పైరుల్తో, కళకళలాడే తోపుల్తో, వాగుల్తో, డొంకల్తో, పచ్చ పచ్చగా వుండే పల్లె పట్టులన్నా, ఆ పట్టుల వుండే జనాలన్నా భక్తి, గౌరవం, ప్రాణసమానం. అందుకే — నిస్సంతు అయిన రామారావు, చేతికి ఎముక లేకుండా దానధర్మాలు చేస్తాడు. ఆ రోజు వానపాముల హైస్కూలు హెడ్మాస్టరు సుబ్రమణ్యంగారు పని గట్టుకుని వచ్చి, స్కూలు వార్షికోత్సవానికి వచ్చి, పిల్లల్ని ఆశీర్వదించి, బహుమతీ ప్రదానం చేయమన్నప్పుడు రామారావు ఎంతో సంతోషంగా ఆ ఆహ్వానాన్ని అంగీకరించాడు. వార్షికోత్సవ సభ ముగిసాక, బహుమతి ప్రదానోత్సవమప్పుడు, బుల్లినిక్కరూ, పొట్టిచేతుల చొక్కా వేసుకుని పరీక్షల్లోనూ, అన్ని ఆటపాటల్లోనూ ప్రథముడుగా వచ్చి బహుమతులు అందుకుంటూ వున్న, ఒక కుర్రాడ్ని చూసి రామారావుకి ముచ్చట వేసింది. ఎర్రగా బొద్దుగా బూరి బుగ్గల్తో ముద్దుగా వున్న ఆ కుర్రాడ్ని చూసి అతనిలో వాత్సల్యం పెల్లుబికింది. వాడికి గొప్ప భవిష్యత్తు వుందనిపించింది.

ప్రక్కనే కూర్చుని వున్న సుబ్రమణ్యంగార్ని అడిగాడు, రామారావు ఆప్యాయంగా.

'ఎవరి కుర్రాడండీ, ఈ అబ్బాయి ?'

'ఈ వూరేలెండి. చాకులాంటి కుర్రాడు ! అన్నిట్లోనూ ఫస్టే !'

'అవునవును.' తల వూపాడు రామారావు.

ఆ తర్వాత ఏదో మాటల సందర్భంలో ఆ విషయం మరుగయింది. రామారావు ఇంటిపట్టున వుండే వేళలు చాలా తక్కువ. ఎప్పుడూ ఏదో వ్యవహారాల గురించి బందరో, బెజవాడో, హైదరాబాదో తిరుగుతూ వుంటాడు. అతని వ్యవసాయపు పన్లను అన్నింట్నీ అతని బావమరిది చూసుకుంటూ వుండటంతో, ఆ విషయంలో అతనికి చింత లేకుండా వుండింది.

గంభీరంగా అవుపించే సాగర గర్భంలో నిరంతరం సుడిగుండాలు ఏర్పడుతూ వుండే అవకాశాలూ వున్నాయి. రామారావు జీవితంలో ఎప్పుడూ ఏ విషయంలోనూ ఒడిదుడుకులు లేవుగాని, ఒక్క రామనాథం విషయంలోనే అతను ఎదురు దెబ్బ తిన్నాడు.

ఆనాడు, సుస్మితంగా, షోకుగా పెళ్లిపీటల మీద కూర్చున్న రామనాథం, పెళ్లికూతురు సీత వంక దొంగ చూపులు చూడటం గమనించి, ఒక దశాబ్దం క్రిందట, చిరునవ్వులు నవ్వుకుని, పచ్చగా వ్రేలాడుతున్న మామిడి తోరణాల్ని, చూపుల్తో పలకరించి మేలమాడిన రామారావు— ఆ తర్వాత ఆ దంపతుల సంసారంలో చెలరేగే పెనుతుపానులు, తనను కూడా వూపివేస్తాయని వూహించలేదు.

కుందనపు బొమ్మలాగా, ఎన్నో మధురోహలతో, పచ్చ పచ్చని జీవితాన్ని వూహించుకుని కాపురానికి వెళ్లిన సీత ఆర్నెల్ల తర్వాత పండక్కని పుట్టింట్లు చేరగా, ఎముకలు పోడుచుకుని వచ్చిన సీత అవతారాన్ని చూసి, పుట్టింట్లో అందరూ గోల పెట్టారు.

'ఏవిఃటే ? ఏమిటిలా అయిపోయావ్ ? అయ్యో ?!'

'అసలేం జరిగిందే, నా తల్లీ ?'

'ఆ కళ్ళేమిటే ? కళ దప్పి అలా లోతుకు పోయాయా ?!' — అంటూ శరపరంగా గుప్పించిన ప్రశ్నలకి జీవంలేని హాసమే సమాధాన

సుఖ దాంపత్య జీవితమునకు పెండ్లిముందు తర్వాత కలుగు నరముల బలహీనత, గుప్తరోగములకు, సుఖ దీర్ఘచర్మవ్యాధులకు, సంతానములేని సోదరీమణుల సంతానము కొరకు ఉత్తమ ఆయుర్వేద చికిత్సకై సంప్రదించండి.


FOUNDER

ప్రసిద్ధిచెందిన సెక్స్ వైద్యులు
Dr. BH. M.V.S. RAO
(Govt Regd)
ప్రతినెల ఈక్రింది తేదీలలో క్యాంప్ కలదు.

3,4, తేదీలలో తిరుపతి హోటల్ భీమాస్ రైల్వేస్టేషన్ వద్ద
5,6, తేదీలలో నెల్లూరు హోటల్ అజంతా ట్రంక్ రోడ్,
7 వ తేది ఒంగోలు హోటల్ అభిలాష్ జి.టి రోడ్,
8,9, తేదీలలో కాకినాడ ద్వారకా లంచ్ హోమ్ మెయిన్ రోడ్,
10,11, తేదీలలో వైజాగ్ హోటల్ ఊటి డాబాగార్డెన్స్,

ఆశా క్లినిక్ (మేడపైన) విజయాటాకీస్ వద్ద, విజయవాడ-2.
FOUNDER: LATE Dr. BH. HANUMANTHA RAO.

రు. 40,000 విలువచేసే బహుమతులు గెలవండి.



మొదటి బహుమతి
రాజదూత్ మోటార్ సైకిల్ లేదా రు. 9000/- నగదు.



రెండవ బహుమతి
టూ-ఇన్-ఒన్ స్టీరియో లేదా రు. 4000/- నగదు.

110 కాన్సొలేషన్ బహుమతులు
(i) ఏటన్ మిక్సర్ గ్రైండర్, తగ్గింపు ధర రు. 265/- లేదా
(ii) ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టర్ రు. 180/- లేదా
(iii) అమెరికన్ డిజైన్ చీర రు 80/- విలువ చేసేది.



ఈ ప్రకటన ధ్యేయం అమ్మకాలను పెంచటం.
ఈ క్రింద మూడు వరుసల్లో, ఏ పక్కనుంచి కూడినా 57 వచ్చే విధంగా 15 నుంచి 23 వరకే అంకెలను వాడేం.
18+23+16 = 57 ఉదాహరణకి
17 19 21
22 15 20
మీరు చేయవలసిందల్లా : ఇదే విధంగా ఎటు చూసినా 60 వచ్చే విధంగా, మూడు వరుసల్లో 16 నుంచి 24 వరకూ అంకెలను వాడాలి.

నిబంధనలు :
ఒక కుటుంబం నుంచి ఒకే ఒక ఎంట్రీ మాత్రమే అంగీకరిస్తాం. ఫలితాలు తెలవగానే విజేతలకు తెలియబరుస్తాం. యాజమాన్యం వారిది తుది నిర్ణయం. మీ ఎంట్రీలను 10 రోజుల్లో పంపండి. మీ చిరునామాను ఇంగ్లీషులోగాని, హిందీలోగాని మాత్రమే వ్రాయండి.

NATIONAL TRADING CO.
Post Box No. 2715, Karol Bagh, New Delhi-5

# ఇనుప తెరలు

మయ్యింది గాని, పెదవిని దాటి మాట బయటికి రాలేదుగాని, వంట్లో బాగాలేదని సీత మంచం ఎక్కగా, డాక్టర్ని తీసుకొచ్చి చూపిస్తే, ఆయన పరీక్షలు చేసి, సుఖవ్యాధి అని చెప్పి, మందులు ఇచ్చాడు. ఆ సంగతి రహస్యంగా రామారావుకి మాత్రమే చెప్పాడు.

అది రామారావు గుండెలమీద పడిన మొదటి సమ్మెట దెబ్బ.

రెణ్నెల్లు వుంచుకుని, కూతురి జబ్బులు నయంచేయించి, పెళ్ళాన్ని తీసుకెళ్ళటానికని, రామనాథంరాగా, మళ్లీ సీతని అత్తారింటికి పంపించేటప్పుడు రామారావుని ప్రక్కకి పిలిచి గొల్లుమని ఏడ్చింది ముసలావిడ. ఈ రెండ్నెల్లలో కూతురు గురించి దిగులుతో ఆమె చిక్కి సగమయింది.

'బావా! సీత మాకు ఒక్కగా నొక్క ఆడపడుచు. అమ్మాయిని అల్లారు ముద్దుగా పెంచుకుని —నీకు వప్పగించాము. జాగ్రత్తగా చూసుకో.' అని రామారావు హితవు చెప్పగా, రామనాథం భ్రుకుటి ముడివేసి, గంభీరంగా సీత వంక చూసేడు.

ఒక సంవత్సరం తిరిగి — ముసలావిడ ఆ దిగుల్తోనే పోయింది —

కడుపయి, పుట్టింటికివచ్చి, పిల్లాడి తల్లి అయ్యేసరికి, సీత రూపు పూర్తిగా మారిపోయింది. ఏడాదికే వసంతం పారిపోయి గ్రీష్మం కాపురం పెట్టింది సీత జీవితంలో.

ఆ తర్వాత - కష్టాల పరంపరలు సీత జీవితాన్ని చుట్టుముట్టాయని, వాళ్ళూ వీళ్ళూ తెలిసినవాళ్ళూ, పరిచయస్తులూ చెప్పినా,నమ్మని రామారావు, విశ్వాసం వదులుకోని రామారావు...

ఆ పాతికెకరాలు సుక్షేత్రమయిన మాగాణీ, యాభయి ఎకరాల మెరకపొలమూ, విస్తారమైన తోటలూ, తోపులూ, మిద్దెలూ, మేడలూ, ఒకటొకటిగా, రామనాథం దుర్వ్యసనాలకోసం కరిగి హారతి కర్పూరం అయిపోయి, జబ్బులూ, అనారోగ్యమూ, వ్యసనాలూ మిగుల్చుకుని వూరి బయట పూరిపాకలోకి, రామనాథం సంసారం మార్చేసరికి —

ఇన్నాళ్ళూ తను వినిన విషయాన్ని నమ్మనందుకూ, చేతులు పూర్తిగా కాలకముందే ఏదో ఒక జాగ్రత్త పడనందుకూ తననితాను తిట్టుకున్నాడు, రామారావు.

అంత జరిగినా రామానాథానికి ఇంకా బుద్ధి రాలేదేమనే రామారావు ఆశ్చర్యపడ్డాడు. బాధపడ్డాడు. కుమిలిపోయాడు. క్రుంగిపోయాడు.

వళ్ళు, జబ్బులతో పుచ్చిపోయినా,కుటుంబం ఆర్థికంగా క్రుంగిపోయినా, పరువు ప్రతిష్ఠలు బజార్లో మంట గలిసిపోయినా, రామనాథం ఇంకా మారనందుకు దుగ్ధపడ్డాడు. రామారావు : గిజగిజలాడి పోయాడు.

అతనికి నయానా భయానా పెద్ద మనుష లన్న నలుగురితోనూ చెప్పించాడు. అయిందేదో అయింది — ఇకనయినా, బుద్ధిగా ఇంటిపట్టున వుండి, పెళ్ళాం పిల్లల్ని ప్రేమగా చూసుకో వలసిందని, మంచిని మప్పించాలని ప్రయత్నిం చాడు. చివరికి నోరు విడిచి, పనిగట్టుకుని వాళ్ళింటికివెళ్ళి, తనూ చెప్పి,వప్పించబోయాడు, రామనాధాన్ని.

కాని —

రామారావు ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరే అయింది. .

ఒకసారి ఆ వూర్నించి ఒక పెద్దమనిషి వచ్చి — లబలబలాడి — బాధపడి —

'రామారావుగారూ ! మీరయినా ఆ సీతమ్మని రక్షించలేరా ?' అని పనిగట్టుకుని అడిగాడు.

'ఏమయిందండీ ?' ఆదుర్దాగా అడిగాడు రామారావు, బాధగా తలవంచుకుని.

'ఏం చెప్పమంటారు బాబూ ! ఆ రాక్షసుడు రోజూ తాగివచ్చి, సీతమ్మతల్లిని కొడుతున్నాడు. ఆ తల్లి నోరు విప్పి ఎవరికీ చెప్పకోదుగానీ, ఆమె వంట్లో విరగని ఎముకే లేదు. ఎప్పుడూ లేంది, ఈ మధ్యన బజారు ముండల్నితెచ్చి, ఇంట్లోపెట్టి 'ఆ తల్లి'ని నానా హింసలూబెడ్తూ, ఆమె చేతనే వాళ్ళకి, నానా వూడిగాలూ చేయిస్తున్నట్లు మా వూళ్ళో చెప్ప కుంటున్నారు. ఇదేంటయ్యా అని ఎవరో వూరుకోలేనివాళ్ళు అడగ్గా — నా ఇష్టం, మీరెవ్వరా నాకు చెప్పటానికి — అని వాళ్ళని బూతులు తిట్టాడు. ఇట్లాగే ఎన్నాళ్ళోసాగదు బాబూ ! వాడు ఆ తల్లిని 'చంపేస్తాడు.' అని గోలబెట్టాడు. బాధపడి కన్నీరు పెట్టాడు.

'అయితే,ఏం చెయ్యాలంటారు?'మనసులో మధనపడిపోతూ, రామారావు అడిగాడు. అతని గుండె చెరువయింది. 'ఏం చెయ్యాలని అలాగ అడుగుతారేమిటండీ బాబు! మీరువచ్చి ఆ తల్లినీ పిల్లడినీ తీసుకొచ్చేయండి, బాబూ. సీతమ్మ దిక్కులేన్దయిపోయింది. కన్నవారుగూడా ఆమెను వదిలేసారా ? అని నలుగురూ అనుకుంటూ వున్నారు. ఆ మాటలు వినలేకనే నేను ఇట్లా మీ దగ్గరకి పరుగెత్తుకు వచ్చాను.' అని సెలవు తీసుకుని ఆ పెద్దమనిషి వెళ్ళిపోయాడు.

ఈ ప్రపంచంలో కొన్ని కొన్ని బ్రతుకులు శాపగ్రస్తమై, భయంకరమైన మంటల్లో, ఎందుకు చిక్కుకుంటాయో కారణాలు అంతు బట్టవు. పీడనకీ, వేదనకీ, హింసకీ, దవుర్జన్యానికీ, కొన్ని ఆడబ్రతుకులు గురవటానికి — ఈ వ్యవస్థలో వుండిన ఒక ప్రబలమయిన లొసుగే కారణం అన్పించుతుంది. ఉన్మాదులూ, వ్యసన లోలురూ, దవుర్జన్య విషయాసక్తులూ—అయిన కొందరు 'మగ జంతువులు,' కొన్ని శతాబ్దాల నుంచీ కూడా, అలా నిర్విఘ్నంగానే ఆడదానికి అన్యాయం చేయటానికి కారణం, ఈ పద్ధతులు, వార్ని వివాహానికి అనర్హులుగా ప్రకటించి అవసర మయిన నిషేధాల్ని అమలు జరపకపోవటమే నన్పిస్తుంది. ''ఏ చోట స్త్రీ కన్నీరొలికి నేలమీద పడుతుందో, అచ్చట అశుభం, అనర్థం, దరిద్రం, క్షామం గజ్జలు కట్టుకుని నాట్యం చేస్తాయ''న్న నానుడి ఆ కారణంగానే వచ్చి వుండాలి.

రామనాధం ఇలా ఎందుకయి పోయాడు?

సీత బ్రతుకు అలాగ ఎందుకయిందీ ? అందులో ఆమె నేర మేమిటి ?

అయ్యో ! అని జాలిపడతారు, మనసున్న వాళ్ళు.

కర్మ — అని చిటికె వేసి తేల్చి పారేస్తారు కర్మ సిద్ధాంత వాదులు. ఎందుకంటే — ఆ రామనాధంగాడికి బుద్ధిలేకనే, డొక్కచించి డోలు కట్టేవాడు లేకనే, వాడు అలాగ కల్లు దాగిన కోతిలాగా పిచ్చివేషాలు వేస్తున్నాడంటారు — ఇంకొందరు.

ఒక వారం రోజులపాటు మధనపడి, రక్త సంబంధం, బంధాలువేసి లాగగా, లాగగా, ఏదో ఒకటి చెయ్యాలని నిశ్చయించుకుని — ఒక రోజు మలిసంజె వేళ రామారావు ఆ వూరికి, ఆ ఇంటికి వెళ్ళేసరికి —

అసహ్యంగా, దరిద్రంగా, ఒంటరిగా వూరి వెలుపల వున్నా ఆ పాకలో — జారిపోయిన మలక మంచంమీద ఒక బజారు మనిషి కూర్చుని, ఇకిలిస్తూ వినోదిస్తూ వుండగా —

తాగి ఎర్రనయిన కళ్ళతో, రేగిన దుబ్బు జుత్తుతో, మాసిన బట్టలతో, అసహ్యంగా, దరిద్రంగా భయంకరంగా, రాక్షసుడిలాగా చెలరేగిన, రామనాథం చేతుల్లో చావు దెబ్బలు తింటూ, ఆ బాధకి మెలిదిరిగిపోతూ, యమ యాతన పడిపోతూ, వుంది సీత !

అది చూసి, రామారావు మొహం కన్నీటితో తడిసిపోయింది. అతని మనస్సులో సముద్రాలు వుప్పొంగాయి. అతని గుండెలు బాధతో మెలిదిరిగి పోయాయి.

'సీతా !' ఆర్ద్రంగా, గాద్గదికంగా, శోకమూర్తి వలె పిలిచాడు రామారావు.

ఆ పిలుపుకి, ఆ బజారు మనిషి కంగారుగా లేచి నిల్చుంది. సీతని వదిలివేసి కణకణమండే కళ్ళతో, రామారావుని కాల్చేసేలా చూసాడు రామనాథం. తడబడుతూ వున్న మాటలతో, 'ఎవడ్రా నువ్వు ?' అని అడిగాడు, ఆ వచ్చిం దెవరో పోల్చుకోలేక.

'ఎందుకు వచ్చావ్‌రా, నా ఇంటికి ?'— అన్నాడు రామనాధం మళ్ళీ,బొంగురు గొంతుకతో. 'నా పెళ్ళాం కోసం వచ్చావంట్రా ?' అంటూ బూతులు . తిట్టి, తూలుకుంటూ వచ్చి రామారావుని చొక్కా పట్టుకుని అటూ ఇటూ బలంగా వూపాడు.

ఆ తర్వాత —

పటపట పది గుద్దులు పడ్డాయి. ఛళ్‌ఛళ్‌న చంపలు పేలిపోయాయి. ధన్‌ధన్‌మని పిడుగుల్లాగ దెబ్బలు పడ్డాయి.


ఆ దెబ్బలకి — నెత్తురు కక్కుకుని, లుంగిలు చుట్టుకుని క్రింద పడిపోయాడు రామనాధం. అది చూసి, ఆ బజారు మనిషి పారిపోయింది, భయపడి.


'సీతా ! రా, పోదాం,' అన్నాడు రామారావు.

'నేను రాను.' రోషంతో అంది సీత.

'ఈ నరకంలో నువ్వు వుండలేవు. వీడు నిన్ను చంపేస్తాడు రా.'

'చంపితే చంపనీ. అతనికాహక్కు వుంది. నేనిక్కడే వుంటాను.'



‘సీతా ! నిన్ను తీసుకు వెడదామని వచ్చాను. రా, వెడదాం.’

‘రాను. నా భర్తని ఇంత దారుణంగా కొట్టిన నువ్వు ఆయనకి శత్రువ్వి ! నాకూ శత్రువ్వే. అసలు ఆయన వంటిమీద చేతులు వేయటానికి నీకా అధికారం ఎవరిచ్చారు ?’

‘నిన్ను హింసించటానికి అతనికేం హక్కుంది ?’

‘అతను నా భర్త. నామీద అతనికి సర్వ హక్కులూ వున్నాయి.’

‘అలాగా ! ఇదే నీ నిర్ణయమయితే, ఇక నాకు చెల్లెలు లేదనుకుంటాను.’ కోపంగా అన్నాడు రామారావు.

# ఇనుప తెరలు

‘నిరభ్యంతరంగా అనుకో.’

‘విషయం చాలా దూరం వెళ్తుంది ! సీతా, నా మాట విను. అన్యాయమైపోకు’ బ్రతిమాలాడు.

‘వెళ్ళనీ. తక్షణం నువ్వు ఇక్కడ్నించి వెళ్ళిపో, నా సంసారం విషయాల్లో ఇతరులు జోక్యం కలిగించుకోవటం నా కిష్టం లేదు. రాక్షసుడా వెళ్ళిపో’ కఠినంగా అంది సీత, ఏడుస్తూనే.

గిర్రున వెనుదిరిగి వచ్చేశాడు రామారావు. వస్తూ వస్తూ కసిదీరా కాండ్రించి వుమ్మేసి వచ్చాడు.

అంతే !

ఆ తర్వాత రెండేళ్ళకి రామనాధం గుండె నొప్పివచ్చి చచ్చిపోయాడని తెల్సింది. రామారావు వెళ్ళలేదు. సీత ఆ వూళ్ళోనే వుంటూ వుందని తెల్సినా, వేరేపనిమీద ఆ వూరు వెళ్ళినా, అటు వయిపు తొంగిచూడలేదు రామారావు. తనకు చెల్లెలు లేదనుకుని, మనసులో ఇనుపతెరని, అతను ఆనాడే దించివేశాడు.

పడక కుర్చీలో కూర్చుని ఆ కుర్రాడి కోసం ఎదురుచూస్తూ కూర్చున్న రామారావు మనస్సులో అప్రయత్నంగానే ఆ సంఘటనలన్నీ కదిలాయి. సీత కొడుక్కూడా ఆ వయసే వుంటుంది. ఆ కుర్రాడు సీత కొడుకయితే ? ఏమో ! కావచ్చు. కాకపోవచ్చుకూడా.

ఆ క్రితం రోజు సాయంత్రం సుబ్రమణ్యం గారువచ్చి, ఆ పిల్లాడి గురించి మాట్లాడి వెళ్ళిపోయారు. ‘ఆ రోజు అన్ని బహుమతులు అందుకున్న ఆ కుర్రాడు చాలా కష్టపడి చదువుతాడట. కాని ఆ పిల్లవాడు చాలా పేదవాడట. పరీక్షల ఫీజు కట్టటానికి రేపే ఆఖరిరోజుట. ఆ పిల్లాడు అంతవరకూ ఫీజు చెల్లించలేదట. ఆ కుర్రాడి తల్లి జబ్బుతో మంచంమీద వుందట. అతనికి నా అన్నవాళ్ళెవరూ లేరట. ‘రేపటిలోగా ఫీజు కట్టకపోతే ఆ అబ్బాయి అన్యాయమయి పోతాడు. బాబూ ! ఎందరికో ఉదారంగా సహాయం చేసిన మీరు ఈ కుర్రవాడికీ చేయూత నిస్తారన్న ఆశతో ఇదంతా మీకు చెప్పాను’ అన్నారు సుబ్రమణ్యంగారు బాధగా.

‘ఫర్లేదు మాష్టారూ. ఆ బాబుని రేపు సాయంత్రం నా దగ్గరకు పంపించండి. అవసరమైన సహాయం చేద్దాం’ అని చెప్పి పంపించివ, రామారావుకి పన్లన్నీ మానుకుని, తను పనిగట్టుకుని, ఆ కుర్రాడి కోసం ఎదురుచూస్తూ కూర్చోవటం ఆశ్చర్యం కల్గించకపోలేదు.

గేటు దగ్గర చప్పుడయింది.

బుల్లి నిక్కరూ, పొట్టిచేతుల చారల చొక్కా, నున్నగా పాపిటతీసి దువ్విన క్రాపూ ! ఆ కుర్రాడు అక్కడనుంచుని వున్నాడు. అతనే !

‘రా, బాబూ !’

ఆ బుడ్డాడు దగ్గరికి వచ్చి నిలబడ్డాడు.

‘కూర్చో !’

కూర్చున్నాడు.

నవుకర్ని పిల్చి, అమ్మగార్ని: పిలుచుకు రమ్మని చెప్పాడు, రామారావు. ‘‘ఏమిటండీ పిలిచారట !’’ అంటూ వచ్చి కూర్చున్న రజని, ఆ కుర్రాడ్ని చూసి ముచ్చటపడిపోయి ‘ఎవరండీ, బాబు ?’ అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. బిస్కెట్లు తెప్పించి ఇచ్చింది.

‘నేనూ అడగలా. వుండు అడుగుతాను’ – అని చిర్నవ్వునవ్వాడు రామారావు.

‘హెడ్మాష్టరు సుబ్రమణ్యంగారు పంపించారాబాబూ, నిన్నూ ?’



నూతన యవ్వనం పొందండి ! సంతానవంతులు కండి. చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్కలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.

‘‘క్యాంపులు’’ :– ప్రతి ఆదివారం ‘భీమవరం’ షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6–30 గం. వరకు. ప్రతినెల 1 మరియు 16 తేదీలలో ‘రాజమండ్రి’ హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

**డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్,**

సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్, పార్కురోడ్, *గుడివాడ*-521 301 ★ ఫోన్స్ : 522 & 540.







ఎ.జిస్
## రింగ్ సోలిన్

తామర, చిడుము మరియు ఎగ్జిమా మున్నగు చర్మవ్యాధులకు శ్రేష్ఠమైనది

**SAGSONS CHEMICAL CO.,**
MADRAS-81

మెస్సర్స్ : గుప్తా కెమికల్ & డ్రగ్, విశాఖపట్నం – 2.

ధర్మపథం :

బులుసు వేంకట రమణయ్య



# ఉపదేశంలోని పద్ధతులు

మన శ్రేయస్సు కోరేవారు సదుపదేశం చెయ్యడం పరిపాటి. వారు మంచిని బోధిస్తూ, చెడ్డనుండి మన బుద్ధిని మళ్లించ డానికి ప్రయత్నిస్తారు. మన వాఙ్మయం చేసే పని కూడా ఇదే! అయితే ఆ ఉపదేశమార్గాలు విభిన్నంగా ఉంటాయి. తప్పు పనులు చేస్తున్న వాణ్ణి ఆ పనుల నుండి మళ్లించడానికి కొందరు కఠినంగా చెప్తారు. కొందరు మృదువుగా చెప్తారు. మృదువుగా చెప్పిన ఉప దేశంవల్లనే ఎక్కువ ప్రయోజనం వుంటుంది.

సాహిత్య శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఉపదేశం మూడు విధాలు – ప్రభు సమ్మతం, మిత్ర సమ్మతం, కాంత సమ్మతం అని. వేదాలు ప్రభువు మాదిరిగా శాసిస్తాయి. అవి చెప్పినట్లు నడుచుకోవాలి. ప్రభువు ఆజ్ఞ అలాంటిదే : 'ఎందుకు ఇలా చెయ్యాలి ?' అని ప్రశ్నించడానికి వీలులేదు. ప్రభు శాసనం ప్రజల మేలు కొరకు ఉద్దేశించబడినట్లే, వేదాలు కూడా మన మేలుకే శాసిస్తాయని గ్రహించాలి. ఇతిహాస పురాణాలు మిత్రసమ్మతాలు. మిత్రుడు ''ఈ విధంగా నడుచుకుంటే మేలు కలుగుతుంది. ఇలా నడుచుకుంటే కీడు కలుగుతుంది. మంచిగా నడచుకున్న ఫలానా వాళ్ళు మేలు పొందారు. చెడు ప్రవర్తన గల ఫలానా వాళ్లందరూ చెడిపోయారు. ఆపదలకు గురి అయ్యారు'' అని మంచిగా చెప్తాడు. ఇతిహాస పురాణాలు ఆ విధంగానే నీతులను బోధిస్తాయి — కాని ఆజ్ఞాపించవు. అధికారాన్ని చూపవు. అందువల్ల వేదాలు చేసే ఉపదేశం కంటె పురాణాదుల ఉపదేశం కొంత సున్నితంగా ఉంటుంది. కావ్యం కాంతా సమ్మిత మైనది. దీనివల్ల జరిగే ఉపదేశం చాలా సున్నితంగా ఉంటుంది. యువతి ''ఇలా చెయ్యాలి; ఇలా చెయ్యకూడదు; ఈ పని జరగాలి; ఇది జరగకూడదు'' అని మాటలతో చెప్పకుండా, తన చేష్టల మూలంగాను, హావభావాల మూలంగాను తెలియజేస్తుంది. కావ్యం కూడా ఆ మాదిరిగానే హితా హితాలను వాక్యాల మూలంగా తెలియజేయకుండా వ్యంగం వల్లనే తెలియజేస్తుంది. దానిని మనం ఊహించుకోవాలి. అంటే ఇతరులచేత చెప్పించు కోకుండా మంచి చెడ్డలు మనమే గ్రహించి సరియైన మార్గంలో ప్రవర్తించాలన్నమాట. పయి మూడు పద్ధతులలోనూ ఈ చివరి పద్ధతి చాలా మెరుగైనది. సున్నితంగా చేసిన హితోపదేశమే తల కెక్కుతుంది. కఠినంగా చేసినది తల కెక్కదు. ''ఇతరులు నాకు చెప్పాలా ? '' అని కూడా తోచవచ్చు. అందు వల్ల మనం చేసే ఉపదేశం ఎంత సున్నితంగా ఉంటే అంత మంచిది. దానివల్ల తప్పక ప్రయోజనం ఉంటుంది. ★

అవునన్నట్టు తలాడించాడు కుర్రాడు.

'మీదేవూరు ?'

'వానపాముల.'

'మీ నాన్నగారు లేరా ?'

'లేరండి.'

'అమ్మ.'

'అమ్మకి జబ్బుండి.'

'పాపం ! అలాగా ! మీ అమ్మగారి పేరు ఏమిటి నాన్నా ?'

'సీతమ్మ.'

రామారావు గుండెల్లో పిడుగులు పడ్డాయి. రజని ఆత్రంగా చూసింది.

'మీ నాన్న పేరేంటి ?'

'సూరపనేని రామనాధంగారు.'

ఇక అనుమానం లేదు. తను వూహించినది నిజమయింది. వాడేవీడు ! 'నువ్వు పరీక్ష ఫీజు కట్టలేదా ?'

'ఉహు !' తల అడ్డంగా వూపాడువాడు.

ముచ్చటపడిన రామారావుకి గుండెల్లో వాత్సల్యఝరులు పొంగాయి. అనురాగ సముద్రాలుప్పొంగాయి. బంధాలు పెనవేసుకొనబోయాయి. వీడు, ఈ పచ్చిమిరపకాయ, ఈ చిన్న వెధవ, తన మేనల్లుడా !

'ఈ పరీక్షే కాదు. ఇంకా పెద్ద పెద్ద చదువులూ చదివిస్తాను. నిన్ను గొప్పవాడ్ని చేస్తాను. నా దగ్గరుండి చదువుకుంటావా ?'— అని అడిగాడు రామారావు, వాత్సల్యంగా.

'అమ్మ... ?'

'అమ్మ రాదులే. తను అక్కడ్నే వుంటుంది. కావాలంటే డబ్బు ఇద్దాం. ఏం ? నువ్వు మరి, మాతో వుంటావా ?'

'ఉహూ' అని స్థిరంగా తల వూపి, లేచి నిలబడి, వెనక్కితిరిగి, పరుగు పరుగున, బాణం లాగా దూసుకుని పారిపోయాడు ఆ పిల్లడు. ఆ హఠాత్సంఘటనకి — నిశ్చేష్టుడై చూస్తూ వుండిపోయాడు, రామారావు.

రజని కుతూహలంగా అతన్నే గమనిస్తూ వుంది. రామారావు కళ్ళు మూసుకున్నాడు. కాసేపట్లో రామారావు కళ్ళనుంచి ధారలుగా కన్నీరు కారి చారికలు కట్టింది.

'రజనీ ! అంతా విన్నావుగదా ! నువ్వూ చూసావుగదా ?'

అవునన్నట్లు తల వూపింది రజని.

'ఇప్పుడు నేనేం చెయ్యాలి ! నిర్ణయం నీకే వదిలేసాను.' అన్నాడు రామారావు.

'అయితే నేను చెప్పినట్లు వింటారా ? అలాగే చేస్తారా ?'

తల పైకీ కిందికీ వూపాడు రామారావు.

'గతంలో అయిందేదో అయిపోయింది. పంతాలూ పట్టింపులకు పోయి, గుండెల్లో ఒకపక్క కుమిలిపోతూనే, కఠినమయిన ''ఇనుప తెరల్ని'' దించుకుని, భేషజం నిల్పుకోవటానికి ప్రయత్నించటం, మనసున్న మనిషి చేయదగిన పనిగాదు. అందువలన, లేచి మొహం కడుక్కోండి. మనం ఇప్పుడే కార్లో ఆ వూరు వెళ్ళి సీత వదిన్ని, పిల్లడినీ తీసుకువద్దాం. వదిన మనది అయినప్పుడు పిల్లడు మనవాడు కాకపోతాడా ?'

'నిజమే సుమా !'

'మరి లేచి తయారవండి. క్విక్.'

తేలికయిన మనస్సుతో, ఉషారుగా లేచాడు, రామారావు. ★